www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 10 అక్టోబర్ 2025



జయచంద్రారెడ్డి కంకర క్వారీ సీజ్



విచారణ చేస్తున్న గనుల శాఖ అధికారులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తెలుగుదేశం పార్టీ తంబళ్లపల్లె నియోజకవర్గ మాజీ నాయకులు జయచంద్రారెడ్డి కంకర క్వారీని గనుల శాఖ అధికారుల బృందం గురువారం తెల్లవారుజామున సీజ్ చేశారు. మండలంలోని తుమ్మలగుంట సమీపంలోని కంకర క్వారీ ఏర్పాటుకు అనుమతులు కోరుతూ జయచంద్రారెడ్డి బావమరిది గిరిధర్‌రెడ్డి పేరిట దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు ఆమోదం తెలపకముందే క్వారీ నడుపుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే నకిలీ మద్యం తయారీ అంశంలో పార్టీ నుంచి సస్పెన్షన్ గురైన జయచంద్రారెడ్డిపై అధిష్టానం ఆగ్రహంగా ఉంది. ఈ నేపథ్యంలో అతని కార్యకలాపాలపై దృష్టి సారించింది. నియోజకవర్గంలో ఆయన చేసిన కార్యకలాపాలపై ఆరా తీస్తోంది.

వైద్య కళాశాల పరిరక్షణకు ప్రజా ఉద్యమం

- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వైద్య సౌకర్యం పొందడం ప్రజల ప్రాథమిక హక్కు, అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ తెలిపారు. ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్య, ప్రజారోగ్యం కొనసాగాలని కోరుతూ జన విజ్ఞాన వేదిక, ప్రజారోగ్య వేదిక, ఎస్ఎఫ్ఐ సంయుక్త నిర్వహణలో పట్టణంలో ఓ ప్రయివేటు ఫంక్షన్ హాలులో గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాల పరిరక్షణకు ప్రజా ఉద్యమం చేయాలని తెలిపారు. ఆరోగ్య రంగంలో పిపిపి విధానాన్ని అమలు చేయడం ప్రజా వ్యతిరేక చర్యన్నారు. రాజ్యాంగ నిర్దేశిక సూత్రాల ప్రకారం వైద్య సౌకర్యం పొందడం ప్రజల ప్రాథమిక హక్కన్నారు. అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. దేశంలో నయా ఉదారవాద విధానాలు ప్రారంభమైనప్పటీ నుంచి ఆరోగ్య రంగంలో ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ ప్రారంభమైందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులపై పెట్టుబడి బాగా తగ్గుతోందన్నారు. ఆరోగ్యశ్రీ, పిఎంజెఎవై వంటి పథకాల ద్వారా ప్రభుత్వ నిధులను ప్రయివేట్ ఆస్పత్రులకు కట్టబెడుతున్నారని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల కోసం ఖర్చు చేయడానికి నిధులు లేవంటున్నారని విమర్శించారు. ప్రయివేట్ రంగం లాభామే పరమావధిగా పనిచేస్తోందని ప్రపంచమంతా అంటుంటే రాష్ట్రంలో మాత్రం ప్రయివేటీకరణ వైపు పోవడం చాలా దారుణమన్నారు. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం ఆరోగ్య సూచికలో రాష్ట్రం 17వ స్థానంలో ఉందన్నారు. ప్రభుత్వం తన బాధ్యతగా ఆరోగ్య వ్యవస్థను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో 10 వైద్య కళాశాలలను పిపిపి ద్వారా ఏళ్ల తరబడి ప్రయివేట్‌కు అప్పగించడం ప్రజావ్యతిరేక చర్యని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానం వల్ల ప్రతిఏటా ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థులు వెయ్యి సీట్లు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు, ప్రజాసంఘాలు, మేధావులు రాజకీయాలకు అతీతంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సమాజం అభివృద్ధి చెందాలంటే విద్య, వైద్యం వంటి పబ్లిక్ సర్వీసులు ప్రభుత్వం రంగంలో ఉండాలని చెప్పారు. పిపిపి విధానం ద్వారా వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న ఆస్పత్రులు కూడా ప్రయివేటీకరణ అవుతాయని ప్రజా ఆరోగ్యవేదిక అధ్యక్షులు ఎంవి.రమణయ్య అన్నారు. అంతిమదశకు చేరుకున్న నయాఉదారవాద విధానాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంకా పట్టుకుని వేలాడుతున్నారని విమర్శించారు. ప్రమాదకరమైన పిపిపి విధానంపై పోరాటం చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ వైద్య ప్రాధాన్యత కరోనా సమయంలో దేశానికి అర్థమైందని చెప్పారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలని కోరుతూ ఈ నెల 27న మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేయాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు ప్రవేశపెట్టిన తీర్మానం సదస్సు ఆమోదం తెలిపింది. ప్రజాసంఘాలు, మేధావులతో కలిసి పోరాటం చేయాలని కోరింది. విసికె పార్టీ రాష్ట్ర నాయకులు పిటిఎం శివ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలకు అనుబంధంగా ఏర్పాటు చేసే 300 పడకల ఆస్పత్రితోనే పేద రోగులకు ఉచితంగా నాణ్యమైన వైద్యసేవలు అందుతాయన్నారు. కేంద్రం 60 శాతం ఇస్తున్నప్పటికీ ప్రభుత్వం ఆర్థిక భారం పేరుతో పది వైద్య కళాశాలలను పిపిపి విధానంలో ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెట్టడం సరికాదన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని పెడచెవిన పెట్టిన నేపథ్యంలో ప్రజాసంఘాలతో ఐక్య కార్యచరణ రూపొందించి ప్రభుత్వ అనాలోచిత నిర?యాన్ని ఎండగడతామని హెచ్చరించారు. బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు మాట్లాడుతూ ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ముందుకెళ్తే ప్రభుత్వాలు మనుగడ సాధించలేవని హితవు పలికారు. వైద్యం ప్రభుత్వ రంగంలో ఉంటే పేద, మధ్యతరగతి ప్రజలకు జరిగే మేలు గురించి ఎయిమ్స్ ఆస్పత్రి ప్రత్యక్ష సాక్ష్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ ఒక్కసారి ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్తే ఆర్థికంగా చితికిపోతున్న సంఘటనలు నేడు గమనిస్తున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ ఆస్పత్రుల సేవలను విస్తృత పర్చాల్సిన అవసరం ఉందని వివరించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన జనవిజ్ఞాన వేదిక నాయకులు టి.హరీంద్రనాథ్ శర్మ మాట్లాడుతూ 37 ఏళ్లుగా విద్య, వైద్య రంగాలపై జెవివి కృషి చేస్తోందని, ప్రభుత్వ వైద్య కళాశాలలపై ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ కవి పోతబోలు రెడ్డెప్ప, సిఐటియు నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆఫ్రిద్, షామీర్, ఐద్వా నాయకులు భాగ్యమ్మ, రెడ్డి ప్రసన్న, అంగన్వాడీ యూనియన్ నాయకులు రాజేశ్వరి, మధురవాణి, ఆశా కార్యకర్తల సంఘం నాయకులు మళ్లీశ్వరి, శంకరమ్మ పాల్గన్నారు.

ఆర్‌టిసి అద్దె బస్సు డ్రైవర్ల నిరసన



రాజంపేట : నిరసన తెలుపుతున్న అద్దె బస్సు డ్రైవర్లు

ప్రజాశక్తి-రాజంపేట

ఆర్‌టిసి అద్దె బస్సు డ్రైవర్‌పై దాడిని నిరసిస్తూ గురువారం డిపో వద్ద అద్దె బస్సు డ్రైవర్లు నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ కార్మిక నాయకులతో కలిసి మద్దతు తెలిపి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఆర్‌టిసిలో శాశ్వత ప్రాతిపదికన పనిచేసే డ్రైవర్లకు ఎలాంటి రక్షణ ఉంటుందో యాజమాన్యం నుంచి తమకు కూడా అటువంటి రక్షణ, అండ ఉండాలని డిమాండ్ చేశారు. నిర్దేశించిన స్టాపింగ్ పాయింట్లలో మాత్రమే బస్సు ఆపే విధంగా నిర్దిష్టమైన ఆదేశాలు ప్రయాణికులు కనిపించే విధంగా స్థాపింగ్ పాయింట్ల పట్టిక బస్సులో ఏర్పాటు చేయాలని, ప్రమాదవశాత్తు గాయపడిన డ్రైవర్‌కు యాజమాన్యం అండగా ఉండే విధంగా చట్టం తేవాలని, ఆరు నెలల తర్వాత తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయమైన తమ 9 డిమాండ్లను ఈ నెల 20వ తేదీలోపు పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా అద్దె బస్సులు నిలిపివేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అద్దె బస్సు డ్రైవర్లతో పాటు సిఐటియు నాయకులు పి.వి.రమణ, ఎం.రమణ, లక్ష్మీదేవి, సిద్దయ్య పాల్గొన్నారు.

ఆర్‌టిసి అద్దె బస్సు డ్రైవర్లకు రక్షణ కల్పించాలి : సిఐటియు

రాయచోటి అర్బన్: ఎపిఎస్ ఆర్‌టిసిలో అద్దె ప్రాతిపదికన ప్రభుత్వం నడుపుతున్న బస్సుల డ్రైవర్లకు రక్షణ కల్పించాలని సిఐటియు మండల కన్వీనర్ డి.భాగ్యలక్ష్మి, కో-కన్వీనర్ బి.వి.రమణలు డిమాండ్ చేశారు. సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా మూడు ప్రాంతాల్లో అద్దె బస్సు డ్రైవర్లపై దాడులు జరిగాయన్నారు. దాడులకు పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని, మరోమారు ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వకపోయినా, నిత్యం తమను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్న హైర్ బస్సు డ్రైవర్లపై ప్రయాణికులు గౌరవభా భావంతో మెలగాలన్నారు. స్త్రీ శక్తి పథకం అమల్లోకి వచ్చినప్పటి నుంచి బస్సు నిర్దేశిత లోడుకు మించి ప్రయాణికులు ఎక్కుతున్నప్పటికీ ఓపికగా డ్రైవింగ్ చేస్తూ విధులు నిర్వహిస్తున్నార న్నారు. ఓవర్ లోడ్ కారణంగా బస్సులను ఆపకపోతే రవాణశాఖ అధికారు లకు ఫిర్యాదులు చేయాలే తప్ప చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని డ్రైవర్లను రక్తం కారేలా కొట్టడం ఆటవిక చర్యగా పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అద్దె బస్సుల డ్రైవర్లపై దాడి చేసి రక్త గాయాలు చేసిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలంటూ కోరారు. అద్దె బస్సులో ఓనర్లు, రవాణా శాఖ అధికారులపై దాడులు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డ్రైవర్ల ఎదుర్కొంటున్న సమస్యల పట్ల సిఐటియు అండగా ఉంటుందని, పోరాటాలకు కార్యాచరణ చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు మండల కో-కన్వీనర్ బి.వి. రమణ, నేతలు మాధవయ్య, వెంకటేష్, రత్నం పాల్గొన్నారు.

పొగాకుకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

ప్రజాశక్తి - రాయచోటి: పొగాకు రహిత సమాజాన్ని నిర్మించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ఏర్పడేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని జాతీయ పొగాకు నియంత్రణ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీవాణి కోరారు. గురువారం ఉదయం డైట్ కళాశాలలో జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిగరెట్టు, ఇతర పొగాకు సంబంధింత ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి విద్యార్థులకు వివరించారు. పొగాకు వినియోగం వల్ల పర్యావరణ కాలుష్యం అవుతోందని చెప్పారు. ప్రజలందరూ మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని పొగాకు, వాటి ఉత్పత్తులకు దూరంగా ఉండాలని తెలియజేశారు. సమావేశంలో పాల్గొన్న వారందరి చేత పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల పరిధిలో ఉన్న దుకాణాలలో సిగరెట్, ఇతర పొగాకు ఉత్పత్తులను అమ్మకూడదని తెలియజేశారు. అతిక్ర మించిన వారిపై సిఒటిపిఎ -2003 చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో డైట్ కళాశాల ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సుమతి, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, అధ్యాపకులు శివ భాస్కర్, వెంకట సుబ్బారెడ్డి, ఉపాధ్యాయినిలు బిఎస్ పద్మావతి, శివలక్ష్మి, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదానం అలవాటు కావాలి

ప్రజాశక్తి - రాయచోటి: రక్తదానం ప్రతి ఒక్కరికీ అలవాటు కావాలని అమానత్ సేవ సొసైటీ వ్యవస్థాపకులు అతావుల్లా పేర్కొన్నారు. సంబేపల్లి మండలం దేవపట్లకు చెందిన సావిత్రి అనే మహిళ కొద్ది రోజులుగా రక్తహీనతతో బాధపడుతూ విజయ హాస్పి టల్‌లో చేరారు. ఆమెకు ఎబి పాజిటివ్ రక్తము అవసరమని వైద్యులు తెలిపారు. వెంటనే బ్లడ్ డోనర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు మయాన మహమ్మద్ అలీ పఠాన్‌కి చెప్పగా వ్యాపారవేత చేత శ్రీ దీప బ్లడ్ బ్యాంకులో గురువారం రక్తదానం చేయించారు. ఈ సందర్భంగా మహమ్మద్ అలీ మాట్లాడుతూ రక్తానికి కృత్రి మంగా ప్రత్యామ్నాయం లేదని, అది ప్రాణాలను కాపాడుతుందని చెప్పారు. ఒక యూనిట్ రక్తం ముగ్గురి ప్రాణాలను కాపాడుతుందని పేర్కొన్నారు. రక్తదానం ఒక గొప్ప సామాజిక సేవ అని తెలిపారు. ఆసుపత్రులలో డిమాండ్‌ను తీర్చడానికి స్వచ్ఛంద రక్తదానాలు చాలా అవసరం అని వారు తెలిపారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సులోచనమ్మ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై దృష్టి : ఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి తెలిపారు. గురువారం మదనపల్లె వన్‌టౌన్ పోలీసుస్టేషన్ డిఎస్‌పి మహేంద్రతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్లో కేసుల వివరాలు, రికార్డులను పరిశీలించారు. నైట్ బీట్లను అప్రమత్తం చేసి చోరీలు, నేరాలు జరగకుండా చూడాలన్నారు. కమ్యూనల్ సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే సమాచారం అందించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో పనిచేయాలన్నారు.

వైసిపి అరాచకాలను సాగనివ్వం

- ఎస్‌సి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అనిత దీప్తి

ప్రజాశక్తి-రాజంపేట

వైసిపివి దిగజారుడు రాజకీయాలని, వారి అరాచకాలు కూటమి ప్రభుత్వంలో సాగనివ్వమని ఎస్‌సి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అనిత దీప్తి తెలిపారు. వైసిపి నేతలు అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడంపై గురువారం టిడిపి దళిత నేతలు ఆర్‌ఎస్ రోడ్డు నుంచి ఆర్అండ్‌బి బంగ్లా వరకు ర్యాలీ చేపట్టి అంబేద్కర్ విగ్రహం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్ రాజు, అనిత దీప్తి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి వారు కులాల మధ్య చిచ్చు పెట్టి చలి కాచుకోవాలనుకుంటున్నారని పేర్కొన్నారు. వైసిపికి రాజ్యాంగం అంటే గౌరవం లేదని, రాజ్యాంగ నిర్మాతపై ప్రేమ లేదని, అంబేద్కర్‌ను కూడా తమ స్వార్థం కోసం దహనం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో రాజంపేట టిడిపి మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, క్లస్టర్ ఇన్‌ఛార్జి కొల్లి రెడ్డయ్య నాయుడు, రామమోహన్, తెలుగు యువత నిరుద్యోగ జెఎసి కన్వీనర్ సిద్ధిక్ పాల్గొన్నారు.

టిడిపి నేతల చేతుల్లో ఎస్‌సిల భూములు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 15 నెలల్లో టిడిపి నాయకులు చక్రం తిప్పి ఎస్‌సిల భూములను హస్తగతం చేసుకున్నారని, నిషేధంలో ఉన్న 22ఎ భూములను రిజిస్టర్ చేయించుకుని దర్జాగా తమ ఖాతాలో వేసుకున్నారని వైసిపి కురబలకోట మండల మహిళా అధ్యక్షులు నక్కా రమాదేవి ఆరోపించారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముదివేడు సమీపంలో కడప క్రాస్‌లో 389/1ఎ, 389/1బిలో ఎస్‌సిలకు 6.33 ఎకరాల భూమి ఉందన్నారు. దాసరపల్లి జయచంద్రరెడ్డి పిఎ రాజేష్ పేరు మీద, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి బంధువు సురేందర్‌రెడ్డి పేరు మీద ఈ ఎస్‌సి భూములు ఈ ఏడాది జూలై 25న రిజిస్టర్ చేశారని పేర్కొన్నారు. టిడిపి నాయకులు ఎక్కడ పడితే అక్కడ ప్రభుత్వ భూములు దోచుకోవడం, అడ్డూ అదుపు లేకుండా అరాచకాలు సృష్టించడం చేస్తున్నారని విమర్శించారు. అధికారులు సైతం వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. సమావేశంలో కురబలకోట ఎంపిపి భూదేవి, ఎంపిటిసి ఆనంద్‌రెడ్డి, నాయకులు రెడ్డి కుమారి, ఉమాపతి, వసంతరెడ్డి పాల్గొన్నారు.

బోధనేతర పనులను బహిష్కరిస్తున్నాం

- ఫ్యాప్టో జిల్లా చైర్మన్ జాబీర్



రాయచోటి : కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

ప్రజాశక్తి-గాలివీడు

బోధనకు ఆటంకం కల్గించే బోధనేతర పనులను, విద్యాశక్తి కార్యక్రమాలను శుక్రవారం నుండి బాయ్ కాట్ చేస్తున్నట్లు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎస్.జాబీర్ తెలిపారు. గురువారం ఎంఆర్‌సిలో ఎంఇఒలు పి.నాగరాజు, శ్రీనివాసులుకు బోధనేతర పనుల బహిష్కరణ మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత, ప్రస్తుత పాలకుల అనాలోచిత నిర్ణయాల కారణంగా ప్రభుత్వ విద్యారంగం బలహీన పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు పాఠాలు చెప్పనీయకుండా ఉపాధ్యాయులకు సంబంధం లేని పనులు చేయమని బలవంతం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇదే విషయంపై వివిధ రూపాల్లో అనేక సార్లు అధికారుల, పాలకుల దృష్టికి తీసుకెళ్ళినప్పటికీ సమస్య పరిష్కారం కానందున బోధనేతర పనులను బహిష్కరిస్తూ ఫ్యాప్టో రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపుమేరకు ఉపాధ్యాయులందరూ బహిష్కరణ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు రమణారెడ్డి, జిట్టా నాగరాజ, మహమ్మద్ గౌస్, శ్రీనివాసులురెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, జి.వి.చలపతి పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** బోధనేతర పనులను బహిష్కరిస్తున్నామని ఫ్యాప్టో నాయకులు ఎంఆర్‌సిలో ఎంఇఒలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్‌లకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు పురం వెంకటరమణ, నరసింహులు, శేఖర్ రెడ్డి, మళ్ళీశ్వర్ బాబు, భాస్కర్ రెడ్డి, హరిబాబు, గజేంద్ర, పాల్గొన్నారు. **పుల్లంపేట :** బోధనేతర పనులను బహిష్కరిస్తున్నామని ఫ్యాప్టో నాయకులు ఎంఇఒకు వితినపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు సి.వి.రమణ మూర్తి, సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, వి.సిద్ధయ్య, రమణ, ఎం.శివరాం ప్రసాద్, మునగపాటి శ్రీను, మాధవ మూర్తి, ఎస్ఎండి గౌస్, నాగభూషణం, పెంచలయ్య, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. **తంబళ్లపల్లె:** ఫ్యాప్టో నాయకులు ఎంఇఒకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు రెడెప్పరెడ్డి, సాంబశివ, పద్మావతి, యహసాన్, వెంకట కుమార్ పాల్గొన్నారు. **నిమ్మనపల్లె :** బోధనేతర పనులను బహిష్కరిస్తున్నామని ఫ్యాప్టో నాయకులు ఎంఇఒకు వితినపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా సెక్రటరీ శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిథిలావస్థ బస్టాండ్లను పునర్నిర్మిస్తాం

- ఆర్‌టిసి ఎమ్‌డి సి.హెచ్.ద్వారకా తిరుమలరావు



సమావేశంలో మాట్లాడుతున్న ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి-రాజంపేట

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్‌టిసి బస్టాండ్లను పరిశీలించి శిథిలావస్థలో ఉన్న వాటిని తొలగించి తిరిగి పునర్నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆర్‌టిసి ఎమ్‌డి సి.హెచ్.ద్వారకా తిరుమలరావు అన్నారు. గురువారం ఆయన స్థానిక బస్టాండ్‌ను సందర్శించారు. బస్టాండ్‌లోని భవనాలు, ప్రయాణికుల కొరకు ఏర్పాటు చేసిన మౌలిక వసతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలలోని బస్టాండ్ల ఎత్తు పెంచి నీరు నిలవకుండా చూస్తున్నామన్నారు. స్త్రీ శక్తి పథకం అమలుపై రాష్ట్ర వ్యాప్తంగా సమీక్షిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ బస్సులు కొనుగోళ్లకు ముందే స్త్రీశక్తి పథకం అమలు కావడంతో ఒకసారిగా ప్రయాణికుల సంఖ్య అధికమైందని పేర్కొన్నారు. దీనిపై అధికారులు, బస్సు డ్రైవర్లు, కండక్టర్లకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. అద్దె బస్సు డ్రైవర్‌పై దాడి గురించి ప్రశ్నించగా వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. సాధారణ డ్రైవర్లతో పాటు అద్దె బస్సు డ్రైవర్లపై కూడా తాము బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఆర్‌టిసి కార్మికుల వేతనాల పెంపు విషయంపై కమిటీ వేశామని తెలిపారు. పార్లమెంట్ కేంద్రమైన రాజంపేట నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లే బస్సులను అధికారులతో చర్చించి తిరిగి పునరుద్ధరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పి మనోజ్ రామ్నాథ్ హెగ్డే, పట్టణ సిఐ నాగార్జున, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆపరేషన్ అప్పలరాజు, కడప ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్, ఆర్‌టిసి ఆర్ఎం పి.రాము, ఎంప్లాయిస్, మజ్దూర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఎమ్‌డిని కలిసిన ఎస్‌పి

మదనపల్లె అర్బన్: ఆర్‌టిసి ఎమ్‌డి సి.హెచ్.ద్వారకా తిరుమలరావును ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి కలిశారు. గురువారం మదనపల్లె కు విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రజారవాణా భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలపై వారిరువురూ చర్చించుకున్నారు. జిల్లాలో బస్సు ప్రయాణికుల భద్రతను మరింత పెంచడం, ముఖ్యంగా బస్సు స్టేషన్లలో భద్రతా చర్యలను పటిష్టం చేయడంపై చర్చించారు. తిరుమలరావు మాట్లాడుతూ ఆర్‌టిసి ప్రయాణికులకు నిరంతరం సురక్షితమైన, నమ్మకమైన సేవలను అందించడానికి కట్టుబడి ఉందన్నారు. జిల్లాలో శాంతిభద్రతలను కాపాడటంలో ఎస్‌పి చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. పోలీసు శాఖ సహకారంతో బస్సులు, బస్సు స్టేషన్లలో భద్రతను మరింత పెంచి, ప్రజలు నిర్భయంగా ఆర్‌టిసి సేవలను వినియోగించుకునేందుకు సహకారం అందిస్తామన్నారు. ఎస్‌పి ధీరజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నత పోలీసు అధికారిగా సేవలందించి, ప్రస్తుతం ఆర్‌టిసికి సారథ్యం వహిస్తున్న ద్వారకా తిరుమలరావు జిల్లాకు రావడం గౌరవంగా ఉందన్నారు. ప్రయాణికుల భద్రత మాకు అత్యంత ప్రాధాన్యతని, ముఖ్యంగా మహిళా ప్రయాణికుల రక్షణకు పోలీసు శాఖ కట్టుబడి ఉందని, ప్రజలకు సురక్షితమైన ప్రయాణ వాతావరణాన్ని అందిస్తామన్నారు.

చెల్లిని తల్లిని చేసిన కామాంధుడు..!

- మగబిడ్డకు జన్మనిచ్చిన బాలిక
- అనారోగ్యంతో మంచం పట్టిన తండ్రి
- బతుకు దెరువు కోసం కువైట్ వెళ్లిన తల్లి
- గుట్టుచప్పుడు కాకుండా కాన్పుచేసిన వైద్యులు
- పుట్టిన పసికందు ఏమయ్యాడో ..?

ప్రజాశక్తి-పీలేరు

ప్రస్తుత సమాజంలో ఆత్మీయ, అనుబంధాలు, రక్త సంబంధాలు కరువవుతున్నాయి. పుట్టింటే ఆడబిడ్డకు రక్షణ కరువుతోన్న పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. కె.వి.పల్లె మండలం, జిల్లెల్లమంత పంచాయతీలో వెలుగు చూసిన సంఘటన అందుకు ఓ నిదర్శనం. అనారోగ్యంతో మంచం పట్టిన తండ్రి, బతుకు దెరువు కోసం బయటి దేశం వెళ్లిన తల్లి. కన్నవాళ్ళు లేనప్పుడు ఆడపడుచు అలనా పాలనా చూసుకోవాల్సిన వారు లేకపోవడంతో వరుసకు అన్నే కామంతో కళ్ళు మూసుకుపోయి చెల్లిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఫలితంగా ఆ బాలిక గర్భందాల్చి ఓ మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయం బయటపడితే పరువు పోతుందన్న భయంతో పుట్టిన బిడ్డను వదిలించుకోవాలని బంధువులు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టి విషయం బయటకు వ్యాపించింది. అటు ఆ బాలిక స్వగ్రామం, ఇటు పీలేరు పట్టణం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పోలీసులు, ఐసిడిఎస్ అధికారుల కథనం మేరకు.. బసన్నగారిపల్లెలో ఓ బాలిక తండ్రి పక్షవాతంతో కొన్నేళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. కుటుంబ భారం మోయడానికి ఆ బాలిక తల్లి గల్ఫ్ దేశానికి వెళ్లింది. ఇంటి దగ్గర ఒంటరిగా ఉంటున్న ఆ బాలికపై ఆమె పెద్దనాన్న కుమారుడు కన్నేశాడు. కొంతకాలంగా ఆమెపై అమాయిత్యానికి పాల్ప డుతూ వచ్చాడు. ఫలితంగా ఆ బాలిక గర్భం దాల్చి, అది ఎవరికి చెప్పుకోవాలో తెలియక మదనపడుతూ తన కడుపులో పిండాన్ని మోసింది. ఆమె శరీరంలో జరిగిన మార్పులను గమనించిన ఇరుగు పొరుగు, సమీప బంధువులు మూడు రోజుల క్రితం ఆ బాలికను పీలేరులోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తీసుకు వచ్చారు. ఆ బాలిక ఐదు నెలలుగా నెలసరి కావడం లేదని వారు తెలపడంతో, బాలికను పరీక్షించిన వైద్యులు గర్భంతో ఉన్న విషయం బయటపడింది. తొమ్మిది నెలలూ నిండి, ఉమ్మ నీరు కూడా లేకపోవడంతో సాధారణ మహిళలకు గర్భం సమయంలో పెరిగే పొట్ట పెరగలేదని, వీలైనంత త్వరగా కాన్పు చేయాల్సిం దేనని వైద్యులు స్పష్టం చేశారు. బంధువులు అడగడంతో తనపై జరిగిన అఘాయిత్యాన్ని ఆ బాలిక బయటపెట్టింది. ఇక చేసేది లేక వారు ఆ విషయాన్ని గ్రామంలోని పెద్ద మనుషులకు తెలియజేశారు. బాలికకు కాన్పు చేయాలని వైద్యురాలిని అభ్యర్థించడంతో ఆమె ఆ బాలికను తన ఆసుపత్రిలో జాయిన్ చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న ఆ బాలిక సోదరుడు గ్రామం నుంచి ఫరారయ్యాడు. అతని తరపు వారు ఆసుపత్రికి చేరుకుని బాలిక వద్దనున్న వారితో మంతనాలు ప్రారంభించారు. పుట్టిన బిడ్డను పీలేరులోనే వదిలించు కోవాలని, బాలిక ఆలనా పాలనా తాము చూసుకుంటామని నమ్మబలికారు. అందరూ సమ్మతించి ప్రసవమైన తరువాత గ్రామంలోని కులపెద్దల సమక్షంలో పంచాయతీ చేసుకోవచ్చని తీర్మానించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ బాలిక బుధవారం రాత్రి మగబిడ్డకు జన్మనిచ్చింది. సాధారణ ప్రసవం కావడం, పీలేరులో ఉంటే ఇబ్బందులు ఎదురవుతాయన్న ఆలోచనతో బిడ్డతోపాటు పచ్చి బాలింతైన బాలికను గురువారం ఉదయం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసుకుని వెళ్లిపోయారు. ఆ సమయంలో పుట్టిన బిడ్డను ఎవరికైనా ఇచ్చేయాలని కొంత మందితో సంప్రదింపులు చేస్తుండడంతో ఈ విషయం బయటకు పొక్కింది. వారు అక్కడి నుంచి స్వగ్రామానికి వెళ్లిపోయారు. ఈ విషయం ఆనోటా ఈనోటా పాకి సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అందరూ ఉలిక్కిపడ్డారు. అటు పోలీసులకు, ఇటు ఐసిడిఎస్ అధికారులకు సైతం సమాచారం లేకపోవడం కొసమెరుపు. ఇటువంటి సంఘటనల్లో కాసింత ముందుగా స్పందించాల్సిన ఐసిడిఎస్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తూ కూర్చోవడం విశేషం. తీరా గురువారం సాయంత్రం స్పందించిన ఐసిడిఎస్ అధికారులు బసన్నగారిపల్లెలోని బాలిక స్వగృహం, పీలేరులోని ప్రయివేటు ఆసుపత్రిలో విచారణ చేపట్టి కాన్పు జరిగిన విషయం నిజమేనని నిర్ధారించారు.

అంతరాయం లేని విద్యుత్తు సరఫరాయే లక్ష్యం

- విద్యుత్ శాఖ చీఫ్ ఇంజినీర్ సురేంద్రనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీర్ సురేంద్ర నాయుడు

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

వినియోగదారులకు ఎలాంటి అంతరాయం కలగకుండా నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయడమే ధ్యేయమని డిస్కం ఒఅండ్ఎం చీఫ్ ఇంజినీర్ సురేంద్రనాయుడు అన్నారు. గురువారం విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఆవరణంలోని ఎస్ఇ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు అంతరాయ లేని నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలనే అంశంపై పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా విద్యుత్ ఉపకేంద్రాల్లో, విద్యుత్తు లైన్లను తరచూ మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. కొత్తగా సర్వీసులు తీసుకున్న విద్యుత్ వినియోగదారులకు ఎన్ఒసి నాంస ప్రకారం సర్వీస్ కనెక్షన్లు మంజూరు చేయాలని ఆదేశించారు. విద్యుత్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో త్వరితగతిన కొత్తవి అమర్చాలంటూ ఆదేశించారు. అధికలోడు ఉన్న ప్రాంతాల్లో అడిషనల్ ట్రాన్స్‌ఫార్మర్లను అమరి లో ఓల్టేజీ సమస్య రాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారులందరికీ పిఎం సూర్య గ్రహ సోలార్ రూఫ్ టాప్ బిగించుకునే విధంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. విద్యుత్ ఉద్యోగులు, ఒఅండ్ఎం సిబబంది వినియోగదారులకు నిత్యం అందుబాటులో ఉంటూ నాణ్యమైన విద్యుత్తు సరఫరా అయ్యేలా చూడాలని సూచించారు. ఉద్యోగులందరూ సోలార్ రూఫ్ టాప్‌లు అమర్చుకోవాలంటూ ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ బ్రహ్మయ్య ఆచారి, అన్నమయ్య సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఈశ్వర్ రెడ్డితోపాటు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అకౌంట్ స్టాఫ్ ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.



స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి మహేంద్ర

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

సైబర్ నేరాలు, బాల్య వివాహాల వల్ల అనర్థాలు, పోక్సో కేసులపై అవగాహన కార్యక్రమాలతో ప్రజలను చైతన్య పరచాలని డిఎస్‌పి మహేంద్ర ఆదేశించారు. గురువారం సిఐ వెంకటేశ్వర్లుతో కలిసి తంబళ్లపల్లె పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్ఐ ఉమామహేశ్వర రెడ్డికి సూచించారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించాలని ఆదేశించారు.



కంప చెట్లను తొలగిస్తున్న విద్యార్థులు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-వీరబల్లి

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ భాస్కర్, రఘురామయ్యలు పేర్కొన్నారు. గురువారం ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు లో భాగంగా దత్తత గ్రామమైన పెద్ద మాదిగపల్లెలో పిచ్చి మొక్కలను తొలగించి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఎలిమెంటరీ స్కూల్ దగ్గర నుంచి పెద్ద మాదిగ పల్లె వరకు రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లను తొలగించి, స్కూల్ ఆవరణంలో మొక్కలకు పాదులు తీసినట్లు తెలిపారు. వాలంటీర్లు అందరికీ మధ్యాహ్నం భోజన సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. ప్రజలకు ఇంటి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో 50 మంది వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.




జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న నీటి సంఘం నాయకులు

చెరువుల్లో పూడిక తొలగించి నీటిని నింపాలి

- ఎంపిడిఒకు నీటి సంఘం నాయకులు వినతి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

సప్త చానల్ పూడికలు తొలగించి చెరువులకు నీటిని నింపాలని నీటి సంఘం అధ్యక్షులు ఎ.రామచంద్ర,ఉపాధ్యక్షులు మద్దిలేటి శంకరలు ఎంపిడిఒకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కానుగంటకుంటచెరువు,పెద్దచెరువు, దేగానిపల్లి చెరువు, బయ్యపుగారి చెరువులకు వచ్చే నీరు గల సప్త చానల్ మొత్తం పూడికలు, చెట్లతో నిండిపోయి ఉన్నాయన్నారు. పైచెరువులకుగాను నీరు వచ్చే బి.కొత్తకోట ప్రజల దాహార్తి తీరుతుందన్నారు .ఆ చెరువుల కింద ఉండే రైతులు సాగు నీరు అందుతుందని, భూగర్భ జలాలు నిండి రైతులందరూ పాడిపంటలతో సస్యశ్యామలంగా మారుతాయన్నారు. బడికాయలపల్లి పెద్దచెరువు, బీరంగి పెద్ద చెరువు నిండిపోయి మరువ పోతున్నాయి. ఆ మొరవ నీరుపై తెలిపిన చెరువులకు వచ్చేటట్టు చర్యలు తీసుకోవాలన్నారు. రాబోవు రోజుల్లో వర్షాలు వచ్చే సూచనలు ఉన్నాయని, దేగానిపల్లి చెరువు నిండిపోయి మరువ పోతున్నదని ఆ మరువ నీరు పెద్దచెరువు,బయ్యప్పగారి చెరువులకు రాకపోగా హంద్రీ -నీవాలోకి వెళ్తున్నాయన్నారు. జెరిపోయిన జిల్లా కాలువ నుండి కానుగుల కుంటకి వచ్చే నీరు రావడం లేదన్నారు. ఆ కాలువ కూడా పూడిక, చెట్లతో నిండిపోయింది. నీరు సంబంధిత అధికారులకు మీరు సమాచారం ఇచ్చి ఆక్రమణలకు గురైన సప్త చానల్ గమనించి వాటిని పూడిక తీసి నీరు అందేలా చేయాలని వారు కోరారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ నంద, నగర పంచాయతీ కమిషనర్ జి.పల్లవి, తహశీల్దార్ బావాజాన్‌లకు వినతి పత్రం అందించినట్లు వారు తెలిపారు.



సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

దొంగ ఓట్లపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి-వీరబల్లి

ఏఐసిసి చేపట్టిన ఓట్ చోర్ గద్దీ చోడ్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆంధ్రప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు దుగ్గనపల్లి సురేంద్రారెడ్డి అన్నారు. మండలంలోని మట్లి పంచాయతీలోని ఆకాది వాండ్లపల్లిలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఓటర్ జాబితాలో ఏవైనా దొంగ ఓట్లు నమోదు అయితే పార్టీ నాయకులు దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఓటర్ జాబితాలోని తప్పు లను సరిదిద్దడంలో ఎన్నికల సంఘం విఫలమైందన్నారు. ఓట్ చోర్, గద్దీ చోడ్ అనే నినాదాన్ని మారుమూల ప్రాంతాలకు వ్యాప్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు భాస్కర్, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు అధ్వానం..ప్రయాణం నరకం



గుంతలమయమైన రోడ్డు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టని అధికారులు

ప్రజాశక్తి-గాలివీడు

అరవీడు పంచాయతీ ఎల్లంపల్లి వద్ద గాలివీడు-మదనపల్లికి వెళ్లే ప్రధాన రహదారి కిలోమీటర్ మేర రోడ్డు అంతా గుంతలమయమై అధ్వానంగా మారిందని..ఈరోడ్డు ప్రయాణించాలనే నరప్రాయంగా మారిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనంలో వెళ్లాలన్నా, ఆటోలో ప్రయాణించాలన్నా, బస్సు ఎక్కాలన్నా చాలా ఇబ్బందికరంగా ఉందని చెబుతున్నారు. రోడ్డంతా కంకర లేచి గుంతలు మయంగా మారిందని వాహనాలు అదుపుతప్పి ప్రమాదం జరిగే పరిస్థితిలు ఉన్నాయని వాపోతున్నారు. కుషావతి నది ఒడ్డు నుంచి ప్రాథమిక పాఠశాల వద్ద పరిస్థితి కూడా ఇలాగే అధ్వానంగా ఉందని పేర్కొన్నారు. సొసైటీ బిల్డింగ్ వద్ద కూడా పరిస్థితి కూడా ఇలాగే ఉందని, సింగంవారిపల్లి క్రాస్ వరకు రోడ్డు పరిస్థితి దయనీయంగా ఉందని తెలిపారు. ఆర్ అండ్ బి అధికారులు దృష్టిపెట్టి మదనపల్లి సబ్ డివిజన్ వరకు రోడ్లకు మరమ్మతులు చేయాల్సి అవసరం ఉందని స్థానిక ప్రజలు, ప్రయాణిలు కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయించాలి

తారు రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉంది. రోడ్డు మీద వాహనాలు వెళ్లాలంటేనే ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాహనం అదుపుతప్పి పడిపోయే ప్రమాదముంది. సంవత్సరాలు తరబడి రోడ్డు అద్వానంగా ఉన్నదని ఒక కిలోమీటర్ మేర తారు రోడ్డు అంతా గుంతలమయంగా మారిపోయింది. బస్సులో కూర్చుని ప్రయాణించాలన్నా ఇబ్బందికరంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి రోడ్డుకు మరమ్మతులు చేయాలి.

-కె.శ్రీకాంత్ శ్రీకాంత్, అరవీడు కసిరెడ్డిగారిపల్లి

వర్షం వస్తే పరిస్థితి దారుణం



గాలివీడు-మదనపల్లి రోడ్డు ద్వారా వెళ్ళాలంటే భయంగా ఉంది. వర్షం వచ్చిదంటే పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. గుంతల్లో వర్షపు నీరు చేరడంతో వాహనాలు అదుపుతప్పి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో వాహనాలు రాక పోకలు సాగించా లంటే చాలా కష్టతరంగా ఉంది. ఏటి వద్ద నుంచి ఎల్లంపల్లి, సింగం వారి పల్లి క్రాస్ వరకు కూడా రోడ్డు పరిస్థితి మరీ అద్వానంగా ఉంది. ద్విచక్ర వాహనంలో రావాలన్నా ఇబ్బంది పడుతున్నాం.

-పసుపులేటి సత్య, అరవీడు

ప్రజలకు ఉత్తమ సేవలు అందాలి : ఎంపిడిఒ



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ రమేష్‌బాబు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ప్రజలకు మెరుగైన ఉత్తమ సేవలను అందించాలని ఎంపిడిఒ రమేష్‌బాబు అన్నారు. గురువారం బండ్లపై గ్రామ సచివాలయాన్ని ఆయన డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని పలు రికార్డులను, ఉద్యోగుల హాజరు పట్టికలను, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అర్హుల జాబితాను పరిశీలించారు. సచివాలయానికి ఉద్యోగులు సకాలంలో హాజరు కావాలని తెలిపారు. సచివాలయంకు వచ్చే ప్రజలతో సఖ్యతగా మెలుగుతూ వారిని గౌరవించాలన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం పై చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతిరోజు చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రజల ఆరోగ్యానికి తగిన ప్రాధాన్యతను కల్పించాలని అన్నారు. తాగునీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరిచి, ప్రజలకు శుద్ధమైన తాగునీరును ప్రతిరోజు అందించాలన్నారు. గ్రామంలో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేను వేగంగా పూర్తి చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్ కార్యక్రమం పై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వ్యాపారస్తులకు జిఎస్‌టిలో మార్పులపై వివరించి వస్తువులను అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ఆరోగ్యానికి ఉపయోగపడే ఔషధాలపై నూతన జిఎస్‌టి ద్వారా 12శాతం నుంచి 5శాతంకు ధరలు తగ్గడం జరిగిందన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ద్వారా ఔషధాల ధరలలో వచ్చిన మార్పులను ప్రజ లకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పార్కింగ్ స్టాండ్‌గా ఆర్‌టిసి బస్టాండ్

-ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్ర గాలివీడులోని నడి బొడ్డున ఆర్‌టిసి బస్టాండ్ ద్విచక్ర వాహనాల స్టాండ్‌ను తలపిస్తోంది. ఆర్‌టిసి బస్సులు నిలవడానికి చోటు ఉండదు కానీ ద్విచక్ర వాహనాలు పార్కింగ్ స్టాండ్‌గా మారిపోయింది. నెలకు ఒకసారైనా గాలివీడు, లక్కిరెడ్డిపల్లి, చిన్నమండెం బస్టాండ్‌కు ఒకరోజు డ్యూటీ వేస్తే ప్రయివేట్ వాహనాలు బస్టాండ్‌లో నిలబడకుండా పోయే అవకాశాలు ఉన్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. బస్టాండ్ సందర్శించడానికి, మౌలిక పరిస్థితులను పరిశీలించడానికైనా ఆర్‌టిసి అధికారులు పరిశీలించాలని చెబుతున్నారు. గాలివీడు ఆర్‌టిసి బస్టాండ్ టీ, సిగరెట్ తాగేవారికి, కబుర్లు చెప్పుకోవడానికి వచ్చేవారు కలుసుకొని మాట్లాడు కోవడానికి అడ్డాగా మారిందే తప్ప ప్రయాణికులు కూర్చోవడానికి బస్టాండ్ లేదన్నారు. స్థానిక పోలీసులు దృష్టి ప్రయాణికుల అసౌకర్యం కల్పించేవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. బస్టాండ్‌లో బస్సుల నిలుపుదలకు అడ్డుగా పార్కింగ్ చేసిన వాహనదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆర్‌టిసి బస్టాండ్‌లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన అవసరం : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ పై ప్రతి ఒక్కరికి అవగాహన తప్పనిసరి అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లక్ష్మీ నరసయ్య తెలిపారు. గురువారం సంబేపల్లి మండలం దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉద్యోగులు, సిబ్బందికి ఆయన జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన కల్పించారు. పాలకులు అమలు పరుస్తున్న జిఎస్‌టి 2.0 వల్ల అన్ని రకాల వస్తువుల ధరలు తగ్గాయన్నారు. పేదలకు అందుబాటులోకి వైద్య సేవలు వచ్చాయన్నారు. జీవిత, వైద్య బీమా సేవలపై గతంలో ఉన్న 12 శాతం జిఎస్‌టిని ప్రస్తుతం పూర్తిగా తొలగించారని చెప్పారు. ఇతర రకాల మందులు రకాల, దృష్టిని సరిచేసే కళ్ళద్దాల పై జిఎస్టి గతంలో 12 శాతం ఉండగా నేడు 7 శాతానికి తగ్గిందన్నారు. 36 రకాల ప్రాణారక్షక కేన్సర్, అరుదైన మందులుపై పన్ను పూర్తిగా తగ్గించేశారంటూ తెలిపారు. మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్‌పై ఉన్న 12 శాతం జిఎస్‌టిని 7 శాతానికి తగ్గించడం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఉద్యోగులు ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలన్నారు. కార్యక్రమంలో దేవపట్ల పిహెచ్‌సి వైద్యులు ప్రకృతి, ఎంపిహెచ్‌ఇఒ వెంకటేష్ పాల్గొన్నారు. **రామాపురం :** నాలుగు స్లాబ్లుగా ఉండే జిఎస్‌టిని కేంద్రం రెండు స్లాబ్లుగా పరిష్కరించిందని ఎంపిడిఒ జాషువా, మండల వైద్యాధికారి వినోద్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిఎస్‌టిపై ఆరోగ్య సిబ్బంది, ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యవసర వస్తువులు మందులపై జీరో శాతం జిఎస్‌టి అమలులోకి తెచ్చింది అన్నారు. రైతులకు మేలు చేసే పరికరాలపై 8 నుంచి 5 శాతం తగ్గించారన్నారు. స్వల్పతరమైన రైతులయంత్రాలపై 12 శాతం ఉన్న జిఎస్‌టిని 5శాతంకు తగ్గించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేసిందన్నారు. డాక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులు మందుల షాపులకు వెళ్లేటప్పుడు జిఎస్‌టి శాతం మొదటి విధంగానే తగ్గించకుండా మందులు ఇస్తున్నారని దానికి జిఎస్‌టిని చూసుకొని కొనుగోలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది. ప్రజలు పాల్గొన్నారు. **నందలూరు :** ప్రజలందరూ మందులపై తగ్గిన జిఎస్‌టి తెలుసు కోవాలని ఎంఎల్‌హెచ్‌పిలు సులోచన, మల్లీశ్వరి, హిమబిందు పేర్కొన్నారు. నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ అరవపల్లిలోని ఆర్ అండ్ బి అతిథిగృహం వద్ద సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఆరోగ్యానికి సంబంధించిన మందులపై జిఎస్‌టిని భారీగా తగ్గించారని, దీనిని అందరూ గుర్తించాలని వివరించారు. మందుల షాపుల్లో ఎవరైనా ఎక్కువ జిఎస్‌టిని వసూలు చేస్తే వెంటనే ప్రశ్నించాలని చెప్పారు. జిఎస్‌టి ఎక్కువ వేస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి:** సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఒ రెడ్డయ్య కమ్యూనిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ సులోచన పేర్కొన్నారు. స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రిలో సూపర్ జిఎస్‌టిపై అవగాహన సదస్సు నిర్వహించారు. మద్దిరేవుల సచివాలయంలో పంచాయతీ సెక్రెటరీ రజనీష్‌రెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది, పంచాయతీ సెక్రెటరీ పాల్గొన్నారు. **ప్రజాశక్తి :** జిఎస్‌టి 2.0లో భాగంగా ప్రజలకు ఉపయోగపడే నిత్యావసరాలు, గృహోపకరణాల వస్తువులపై జిఎస్‌టి శాతాన్ని తగ్గించడంతో సామాన్యులపై భారం తగ్గిందని కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి హర్షం వ్యక్తం చేశారు. పంచాయతీ పరిధిలోని స్థానిక సచివాలయం నందు ఉప సర్పంచ్ నాగరాజ, సచివాలయం, పంచాయతీ సిబ్బందితో కలిసి సూపర్ జిఎస్‌టి - సూపర్ సేవింగ్స్ కరపత్రాలను ఆవిష్కరించారు. **కలికిరి :** కలికిరి సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాలను సారం ఆరోగ్య రంగంలో జిఎస్‌టి తగ్గడం వల్ల ప్రజలకు కలిగిన లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపిడిఒ భానుమూర్తిరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వస్తువులపై తగ్గించిన జిఎస్టి స్లాబులు గురించి వివరించారు. ఆరోగ్యపరమైన బీమాలపైన ఎటువంటి జిఎస్‌టి ఉండదని వివరించారు. కార్యక్రమంలో ఇఒ జి.అశోక్, రైతులు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ ఉదయ్‌కిరణ్ డాక్టర్ శశికుమార్, డాక్టర్ విజయచంద్రిక, నర్సులు వైద్య సిబ్బంది రోగులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-పుల్లంపేట : మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న పలు వురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల పీడీ నీలకంఠరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరుమామిళ్లలోని జూనియర్ కళాశాలలో ఎస్‌జిఎఫ్ అండర్-19 బాలికలు, బాలురకు సాఫ్ట్ బాల్, బేస్‌బాల్ విభాగంలో జిల్లాస్థాయి ఎంపికలు జరిగాయని తెలిపారు. ఈ ఎంపికల్లో తమ పాఠశాలకు చెందిన బాలికలు సాఫ్ట్ బాల్ విభాగంలో జాస్మిన్(పదవతరగతి), హర్షిత (ఇంటర్ ద్వితీయ సంవత్సరం), సంధ్య(ఇంటర్ ద్వితీయసంవత్సరం) ఎంపికయ్యారని చెప్పారు. బాలుర విభాగంలో రిషిత్ వర్మ(పదవ తరగతి), హేమంత్(పదవ తరగతి), బాలికల బేస్‌బాల్ విభాగంలో జాస్మిన్ ఎంపికయ్యారని చెప్పారు. హర్షిత(ఇంటర్ ద్వితీయసంవత్సరం), బేస్‌బాల్ బాలుర విభాగంలో రిషిత్ వర్మ(పదవతరగతి), మోహిత్(పదవ తరగతి), అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్ ప్రత్యేకంగా అభినందించారు.

స్కూల్ గేమ్స్‌లో సత్తా చాటిన శ్రీచైతన్య విద్యార్థులు

రాజంపేట : అండర్-14, అండర్-17 స్కూల్ గేమ్స్ పోటీలలో ఆర్ఎస్ రోడ్డు లోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధ, గురు వారాలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ అండర్ -14 బాల్ బ్యాడ్మింటన్‌లో సుప్రీత్, యస్వంత్ ప్రథమ స్థానంలో నిలవగా అండర్-17 100 మీటర్ల పరుగు పందెంలో నిహారిక ద్వితీయ స్థానంలో నిలిచినట్లు సుధాకర్ రెడ్డి తెలిపారు. అండర్-14 పరుగు పందెంలో యోగానంద ప్రథమ స్థానం, అండర్,-17 భరత్ తృతీయ స్థానంలో నిలిచారని, అండర్ -17 లాంగ్ జంప్‌లో దేవకి ప్రథమ స్థానంలో, అండర్ -17 షాట్ పుట్ నందు రోహిత్ ప్రథమ స్థానం లో నిలిచారని, అండర్-14,17 కబడ్డీ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలి చారని తెలిపారు. ఈ పోటీలకు మన్నూరు పాఠశాల పీడీ ఎం.రమేష్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో పీడీలు టి.చంద్రశేఖర్, ఎస్.గణేష్, ఎస్.శాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజలకు సంతృప్తికరంగా సేవలు : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజలకు సంతృప్తికర స్థాయిలో సేవలు అందించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ప్రజల నుంచి వివిధ అంశాలపై సేకరించిన ప్రజాభిప్రాయ సేకరణ, మూడంచల గ్రామం, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు, ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశానికి రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నిశాంత్ కుమార్, జెసి ఆదర్శ రాజేంద్రన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఆసుపత్రుల సేవలు, రీ సర్వే, తదితర సేవలపై సమీక్షిస్తూ ప్రజలకు సంతృప్తికర స్థాయిలో సేవలు అందించాలని సూచించారు.ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కార్యక్రమంలో పెండింగ్ పనులు ఏమైనా ఉంటే వెంటనే పూర్తి చేయాలని సూచించారు.అనంతరం కలెక్టర్ నిశాంత్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులకు ఆయా శాఖల అంశాలకు సంబంధించి తగు సూచనలు జారీ చేశారు.

నాణ్యమైన ఔషధాలు అందించండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జబ్బులకు తగినవిధంగా నాణ్యమైన ఔషధాలను అందించి ప్రజల మన్ననలు అందుకోవాలని టిడిపి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం నిమ్మనపల్లి సర్కిల్‌లో మదీనా న్యూ లైఫ్ కేర్ మెడికల్స్ దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా ఆర్.జె వెంకటేష్‌కు మెడికల్స్ నిర్వాహకులు కదిరి ఫయాజ్‌అలీఖాన్, ఎం.రమేష్ పూలమాల, శాలువాతో ఘనస్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి మెడికల్ దుకాణాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రజలు యాంత్రిక జీవనానికి అలవాటు పడి బిసి, షుగర్, థైరాయిడ్ వంటి జబ్బులు బారిన పడుతున్నారన్నారు. ఈ జబ్బులకు దీర్ఘకాలికంగా మందులు వాడాల్సి వస్తోందని, ఆ జబ్బులతోపాటు ఇతర అన్నిరకాల జబ్బులకు మదీనా లైఫ్ కేర్ మెడికల్స్‌లో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు ప్రజలు మదీనా లైఫ్ కేర్ మెడికల్స్ దుకాణాన్ని సంప్రదించి అవసరమైన మందులు తీసుకొని ఉపశమనం పొందా లన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాంచంద్ర నాయుడు, మహేశ్వర్ రెడ్డి, ఎల్.మాధవ్ నాయుడు, ఎం.హరి, ఎ.రమణ, చక్రపాణి పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి వెన్నెముక : 'పెద్దిరెడ్డి'

ప్రజాశక్తి-రాజంపేట

కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆకేపాడులో జిల్లా వైసిపి విస్తృత స్థాయి సమావేశం ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో అకేపాటి ఎస్టేట్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. నియోజకవర్గ, మండల స్థాయి సమావేశాలు కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సభలో సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసుకునేందుకు కొత్త కమిటీలు ఏర్పాటు, ప్రతి కార్యకర్తకు చేరువుగా పార్టీ విధివిధానాలపై తీర్మానం చేశారు. అనంతరం ఎంపీ మేడా రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ సమష్టి కృషితో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ఇందుకు పార్టీలోని ప్రతి కార్యకర్త భాగస్వామి కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, బడుగు బలహీన వర్గాల కుటుంబాల శ్రేయస్సు కోసం పరితపించే పార్టీ వైసిపి అన్నారు. ఈకార్యక్రమంలో మదనపల్లి మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి, కడప మాజీ మేయర్ సురేష్‌బాబు, సుగవాసి బాలసుబ్రహ్మణ్యం, రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువకుడిపై ఫోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

బాలికను మోసగించినందుకు ఓ యువకుడి పై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తవళం గ్రామానికి చెందిన ఓ బాలికపై(17) మదనపల్లెలో తన కుటుంబ సభ్యులతో ఉంటూ అక్కడే చదువుకుంటుందన్నారు. అప్పుడప్పుడు సెలవు రోజులలో కుటుంబ సభ్యులతో కలిసి తన సొంత గ్రామానికి వస్తుండేదన్నారు. అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు అత్యాచారానికి పాల్పడి మోసగించారని బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదులు పేర్కొన్నారని తెలిపారు. ఈనెల 3న మదనపల్లి నుంచి యువకుడు మైనర్ బాలికను తన ద్విచక్ర వాహనంపై తీసుకు వెళ్తుండగా కుటుంబ సభ్యులు గమనించి బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందించారన్నారు. బాలికను కుటుంబ సభ్యులు విచారించగా జరిగిన విషయాన్ని తెలిపిందన్నారు. గ్రామ పెద్దలతో కలిసి యువకుడి కుటుంబ సభ్యులతో మధ్యవర్తిత్వం చేయగా అందుకు యువకుడు ఒప్పుకోలేదన్నారు. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని బాలికను మోసగించిన దానిపై యువకుడిని గ్రామ పెద్దలు విచారించి పంచాయతీ చేయడానికి ప్రయత్నించగా యువకుడు అందుకు ఒప్పుకోకుండా మీ చేతనైంది చేసుకోండని దురుసుగా ప్రవర్తించారని ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు. బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకుడు పై ఫోక్సో కసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్య హత్య కేసులో భర్తకు ఏడేళ్లు జైలు శిక్ష

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

భార్యను హత్య చేసిన కేసులో భర్త రౌతుబాబు గురువారం కడప అదనపు ఏడవ న్యాయమూర్తి రమేష్‌కుమార్ ఏడేళ్లు జైలు శిక్ష, రూ.1.70లక్షలు జరిమానా విధించినట్లు లక్కిరెడ్డిపల్లి పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా దినేపాడు వడ్డేపల్లి చెందిన రౌతుబాబు సంబేపల్లి మండలం నారాయణరెడ్డిపల్లి మండలపల్లెకు చెందిన యువతిని 2021లో వివాహం చేసుకున్నాడని, ఆమెను వేధింపులు గురిచేసి హత్య చేశాడని మృతురాలు తండ్రి ఫిర్యాదు చేశారన్నారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సెక్షన్ 498, 304 ఐపిసి సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ కేసు గురువారం విచారణ చేపట్టి జడ్జి ముద్దాయికి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.కేసులో న్యాయం సాధించడంలో కృషి చేసిన పోలీసు అధికారులు, ప్రాసిక్యూషన్ బృందం, కోర్టు సిబ్బందిని ఎస్‌సి ధీరజ్ కునుబిల్లి ప్రత్యేకంగా అభినందించారు.మహిళల రక్షణ కోసం కఠిన చర్యలు, వేగవంతమైన విచారణ, గుడ్ ట్రయల్ మానిటరింగ్ కొనసాగుతాయని తెలిపారు.



శిక్ష పడిన ముద్దాయితో పోలీసులు